క్లుప్తంగా

ఒకరికి పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 18 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో ఒకరికి పాజిటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 11 మందికి నిర్వహించినట్లు పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 20, పచ్చిమిర్చి 40-50, బెండ 45, కాకర 50, దొండ 30, దోస 40, ఆలు 25, చామ 70, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 70, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 55, క్యాబేజీ 20, క్యారెట్ 30, చిక్కుడు 60, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (3) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 140, వెల్లుల్లి 100.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'బీ లైట్ అండ్ ఫీల్ మైట్' అనే అంశంపై లైఫ్ కోచ్, మెడిటేషన్ గైడ్ కౌన్సిలర్ ఈ.వి.స్వామినాథన్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించవచ్చు.

కరోనా పరీక్షలు

గచ్చిబౌలి: కొండాపూర్ ఏరియా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన కోవిడ్ టెస్టులలో పాజిటివ్ కేసులు నిల్ అని సూపరింటెండెంట్ డాక్టర్ వరదాచారి తెలిపారు. గురువారం 26 మందికి కోవిడ్ టెస్టులు చేశామన్నారు. ఐదుగురికి ఆర్టీపీసీఆర్, 21 మందికి రాపిడ్ యాంటిజెన్ పరీక్షలు చేశారు.

పాదుకల ఊరేగింపు



పాదుకలను ఊరేగింపుగా తీసుకొస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి గుల్‌మొహర్ పార్కు కాలనీలో గురువారం శ్రీ గురుదత్త పాదుకల ఊరేగింపు నిర్వహించారు. కాలనీ ప్రధాన ద్వారం నుంచి భక్తుల కోలాటం, సాయినాధుడి నామస్మరణతో నేతాజీనగర్‌లోని శ్రీ సాయిబృందావన క్షేత్రం వరకు ఊరేగింపు కొనసాగింది. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు రాగం సుజాత యాదవ్, వీరేశంగౌడ్, సోందాస్, శ్రీనివాస్‌రాజ్ ముదిరాజ్, అనిరుధ్‌యాదవ్, గడ్డం రవియాదవ్, గోపాల్ యాదవ్, రాంచందర్ యాదవ్, శ్రీకళ, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరకు విరాళం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో జరగనున్న శ్రీ ముత్యాలమ్మ తల్లి జాతరకు రూ.20వేల విరాళాన్ని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధారాణి గురువారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, యాదగిరి, అచ్చు, ముత్తు, చందు, ముత్యాలు, నర్సింహ పాల్గొన్నారు.

నేడు ఐఐఐడీ-హెచ్‌ఆర్‌సీ డిజైన్ అవార్డుల ప్రదానం

రాయదుర్గం: ఐఐఐడీ-హెచ్‌ఆర్‌సీ డిజైన్ అవార్డులు-2022 కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి 7 గంటలకు రాయదుర్గంలోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఇంటీరియర్ డిజైనర్లకు ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీరామారావు ముఖ్య అతిథిగా, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ రానున్నారు.

ఔటర్ పై ఇన్నోవా దగ్ధం

తృటిలో తప్పిన ప్రమాదం

గచ్చిబౌలి: ఔటర్ రింగ్ రోడ్డుపై ఇన్నోవా కారు దగ్ధమైన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మహేష్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్ నుంచి అప్పా జంక్షన్‌కు వెళుతుండగా గచ్చిబౌలిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై ఎల్‌అండ్‌టీ టవర్స్ సమీపంలో కారు నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్ని కీలల్లో ఇన్నోవా పూర్తిగా దగ్ధమైంది. ఇంజన్ నుంచి పొగ రావడాన్ని గమనించిన డ్రైవర్ పుట్టా శివ చరణ్ కారును పక్కకు ఆపి అతనితో పాటు మరో వ్యక్తి కిందికి దిగారు. అంతలోనే మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పినా అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. ఇద్దరు కిందికి దిగడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ శివ చరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



నిత్యం మురుగు సమస్య



రామకృష్ణనగర్ కమాన్ వద్ద మురుగులో వాహనదారుల ప్రయాణం



రామకృష్ణనగర్ వద్ద జాతీయ రహదారిపై పారుతున్న మురుగు నీరు

- పూర్తికాని నాలా విస్తరణ పనులు
- రోడ్లపై పారుతున్న డ్రైనేజీ
- దుర్వాసనతో వాహనదారులు సతమతం
- పట్టించుకోని అధికారులు

హఫీజ్‌పేట్ : డివిజన్ పరిధిలో మదీనాగూడ నుంచి దీప్తిశ్రీనగర్ నాలా వరకు జాతీయ రహదారిపై మురుగునీరు రోడ్లపై పారుతోంది. నాలా కల్వర్టు పనుల ఆలస్యంతో సమస్య నెలకొంది. ఈర్ల చెరువు నుంచి దీప్తిశ్రీనగర్ జాతీయ రహదారి వరకు సుమారు రూ.15 కోట్లతో 2.4 కిలోమీటర్ల పొడవు నాలాను విస్తరిస్తున్నారు. పనులు దాదాపుగా పూర్తి అయినప్పటికీ కొంతమేర ఆగిపోవడంతో మురుగునీరు రోడ్లపై చేరుతోంది. దీంతో రామకృష్ణనగర్ కాలనీవాసులు నిత్యం మురుగుతో అవస్థలు పడుతున్నారు.

- ఈర్ల చెరువు నుంచి వైశాలీనగర్, వినాయకనగర్, మదీనాగూడ, రామకృష్ణనగర్ జాతీయ రహదారి వరకు సుమారు 2.4 కిలోమీటర్ల నాలా దీప్తిశ్రీనగర్ వద్ద నాలాలో కలుస్తుంది.
- నాలా కల్వర్టు పనుల్లో ఆలస్యం జరుగుతుండడంతో సమస్య పరిష్కారమయ్యేదెన్నటికీ అంటూ స్థానికులు వాపోతున్నారు.
- ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పనుల పురోగతిపై సమీక్షిస్తున్నా పూర్తికాకపోవడంపై స్థానిక ప్రజలు అసహనానికి గురవుతున్నారు.
- జాతీయ రహదారిలో సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రులు ఉన్నాయి. వాటి ముందే మురుగు నీరు పారుతోంది.
- వాహనదారులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు.
- జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రామకృష్ణనగర్ కమాన్ ముందు పొంగుతున్న మురుగు నీరు

ఏడాది నుంచి రోడ్డుపై..



ఏడాది నుంచి మదీనాగూడ రామకృష్ణనగర్ కమాన్ ముందు డ్రైనేజీ నీరు పొంగి పార్లుతోంది. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. నాలా విస్తరణ పనులు పూర్తి అయితే అందులో ఈ పైప్‌లైన్ కలుపుతారని చెబుతున్నారు. ప్రతి రోజు దుర్గంధంతో ముక్కు మూసుకొని వెళ్ళాల్సిన పరిస్థితి ఉంది.

–మల్లేష్, రామకృష్ణనగర్

డ్రైనేజీ పొంగకుండా చర్యలు తీసుకోవాలి



డ్రైనేజీ సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలి. నెలల తరబడి మురుగు నీటి నుంచి వాహనాలపై వెళ్ళాలి. ఎన్నాళ్లిలా.. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారం చూపాలి.

– రవి, మదీనాగూడ

అభివృద్ధి పట్టని బీఆర్‌ఎస్



దత్తాత్రేయ కాలనీలో పాదయాత్రలో రవికుమార్‌యాదవ్, బీజేపీ నాయకులు

బీజేపీ నాయకుడు రవికుమార్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ: బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్ చేపట్టిన గడప గడపకు బీజేపీ కార్యక్రమం గురువారం ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో మహవీర్‌నగర్, దత్తాత్రేయ కాలనీల్లో జరిగింది. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలలో నాయకులు అభివృద్ధిని కాంక్షించే వారని ఇప్పుడున్న నాయకులు దోచుకోవటం, దాచుకోవటం ,దురుసుగా ప్రవర్తించటం అలవాటై పోయిందని తెలిపారు. డివిజన్‌లో అనేక సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని ముఖ్యంగా డ్రైనేజి, రోడ్లు, రేషన్ కార్డులు, డబుల్ ఇళ్లు, నిరుద్యోగ సమస్యతో ప్రజలు కొట్టుమిట్లాడుతున్నారన్నారు. వీటన్నిటికి చరమగీతం పాడాలంటే తెలంగాణలో బీజేపీ జెండా ఎగరాలని తెలిపారు. ఈ పాదయాత్రలో ఉపాధ్యక్షుడు రామరాజు, నరేంద్రరెడ్డి, కుమార్ యాదవ్, కమలాకర్‌రెడ్డి, రవీందర్‌రావు, నర్సింగ్ యాదవ్, నరసింహాచారి, అనిత ,యువ మోర్చా, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోపన్‌పల్లితండాలో..

రాయదుర్గం: గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా గోపన్‌పల్లితండాకు వచ్చిన పార్టీ నాయకుడు రవికుమార్‌యాదవ్, మిగతా నాయకులకు గిరిజన సాంప్రదాయ పద్ధతిలో స్థానికులు స్వాగతం పలికారు. బీజేపీ రంగారెడ్డిజిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు హన్మంతునాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ మహారాజ్, మేరమ్మమాత ఆలయాల్లో పూజలో పాల్గొన్నారు. అనంతరం నాయకులు ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్‌కు భారీ గజమాలతో సత్కరించారు.

రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లి రోడ్డు సమస్యను పరిష్కరించాలంటూ గురువారం బీజేపీ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీమంత్రి, బీజేపీ రాష్ట్ర నాయకులు బాబుమోహన్ వారి దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పాలకులు అభివృద్ధి విషయంలో ఈదులనాగులపల్లిని చిన్నచూపు చూస్తున్నారన్నారు. రేడియల్ రోడ్డు నంబర్7ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. సరైన కనెక్టివిటీ రోడ్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నాయకులు వాపోయారు. కార్యక్రమంలో బాలాగౌని రాంబాబు గౌడ్, కౌన్సిలర్ శంషాబాద్ రాజు, మున్సిపల్ అధ్యక్షుడు కోటే శంకర్‌లు ఉన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, జిల్లా సహ ఇన్‌చార్జ్ రామకృష్ణ, పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ సభ్యులు గడీల శ్రీకాంత్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్‌లు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో పుస్తకావిష్కరణ



కార్యక్రమంలో పాల్గొన్న ప్రోవీసీ ప్రొఫెసర్ సర్రాజు, ఇతర అతిథులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో గురువారం సాయంత్రం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సెంటర్ ఫర్ దళిత్ అండ్ ఆదివాసీ స్టడీస్ అండ్ ట్రాన్స్‌లేషన్ విభాగం, అంబేద్కర్ రీడింగ్ సర్కిల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌సీయూ విద్యార్థిని నమ్రతా సింగ్ రచించిన 'భోజ్‌పురి నవజాగరణ్ ఔర్ భికారీ ఠాకూర్' అలాగే 'సమ రాష్ట్ర ఝరి ఇన్ ది ల్యాండ్స్ ఆఫ్ కృష్ణా గోదావరి'ను ఆవిష్కరించారు. సమరాష్ట్రా మంచ్ జాతీయ కన్వీనర్ శ్యామ్‌ప్రసాద్, హెచ్‌సీయూ ప్రో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆర్‌ఎస్ సర్రాజు చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ థాట్స్ ఆన్ సోషల్ రిఫార్మ్స్ అండ్ జస్టిస్ అనే అంశంపై ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సమరాష్ట్రా మంచ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వంశీతిలక్, సీడీఏఎస్‌టీ ఇన్‌చార్జ్ హెడ్ ప్రొఫెసర్ అన్నపూర్ణ, ఏబీవీపీ అధ్యక్షురాలు నమ్రతాసింగ్, పలువురు పాల్గొన్నారు.

8వ బెటాలియన్‌లో హెల్త్‌క్యాంపు



హెల్త్ క్యాంప్‌లో పరీక్ష చేస్తున్న వైద్యులు

గచ్చిబౌలి: నరాల సంబంధిత సమస్యలు తలెత్తితే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని కాంటినెంటల్ ఆస్పత్రి న్యూరో సర్జన్లు, డాక్టర్ లక్ష్మీనాథ్, డాక్టర్ శివరాజ్‌లు సూచించారు. గురువారం కొండాపూర్‌లోని టీఎస్‌ఎస్‌పీ 8వ బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన హెల్త్‌క్యాంప్‌లో నరాల సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులకు పరీక్షలు నిర్వహించారు. వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తిస్తే త్వరగా నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ పి.మురళీకృష్ణ, అడిషనల్ కమాండెంట్లు టి.గంగారాం, టీఎస్ సంఘ్, అసిస్టెంట్ కమాండెంట్లు దేవిదాస్ రాథోడ్, నర్సింహస్వామి, రహమాన్, సత్యనారాయణ, ఏఓ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

షాజియా తమ్కీన్‌కు డాక్టరేట్

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థి షాజియా తమ్కీన్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఉర్దూ విభాగంలో పరిశోధక విద్యార్థిని షాజియా తమ్కీన్ 'మహిళా కల్పన రచయితల రచనలలో స్త్రీవాద ఆలోచనల విమర్శనాత్మక సమీక్ష' అనే అంశంపై ఉర్దూ విభాగం ప్రొఫెసర్ అబుల్ కలామ్ పర్యవేక్షణలో థీసిస్‌ను సమర్పించారు. అనంతరం వైవా కార్యక్రమాన్ని నిర్వహించి ఆమెకు డాక్టరేట్ డిగ్రీని ప్రకటించారు.

పూడికతీత పనులు ప్రారంభం

రాయదుర్గం: జీహెచ్‌ఎంసీ అధికారులు నాలాల్లో పూడికతీత పనులను చేపట్టారు. గురువారం గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గం బుల్కాపూర్ నాలాలో శేరిలింగంపల్లి సర్కిల్ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. కొన్ని ప్రాంతాలలో నాలా రిటైనింగ్‌వాల్ నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పలుచోట్ల పేరుకుపోయిన మట్టిని కూడా పూర్తిగా తొలగిస్తే సాఫీగా మురుగు పారుతుందన్నారు.



రాయదుర్గంలోని బుల్కాపూర్ నాలాలో పూడికతీత పనులను చేపట్టిన దృశ్యం

వేసవిలో దొంగతనాల నివారణకు ప్రత్యేక ప్రణాళిక



సైబరాబాద్ కమిషనరేట్‌లో సమీక్షా సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు

సైబరాబాద్ పోలీసులతో సీపీ సమీక్ష

రాయదుర్గం: గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో సమ్మర్ క్రైమ్స్ ప్రివెన్షన్‌పై సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువగా దొంగతనాలు వేసవిలో జరుగుతాయన్నారు. పోలీసు సిబ్బంది రానున్న రెండు నెలల్లో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జోన్ల వారీగా డే అండ్ నైట్ బీట్‌లను స్వయంగా పరిశీలిస్తానన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే అంతరాష్ట్ర ముఠాలపై నిఘా ఉంచాలని, గేటెడ్ కమ్యూనిటీస్ అపార్ట్‌మెంట్స్ విల్లాల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. జైలు నుంచి విడుదలైన పాత నేరస్తులపై నిఘా ఉంచడంతోపాటు క్షేత్రస్థాయి పోలీసు సిబ్బంది హోటళ్లు, లాడ్జిలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాల తనిఖీ తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ సమావేశంలో సైబరాబాద్ డీసీపీ క్రైమ్స్ కల్మేశ్వర్, లా అండ్ ఆర్డర్ డీసీపీలు శిల్పవల్లి, నారాయణరెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, శ్రీనివాసరావు, సందీప్, ఏడీసీపీ రేష్మిపెరుమాళ్, నర్సింహారెడ్డి, ఇతర ఏడీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో పరీక్ష చేయించుకుంటున్న నాయకులు యోగానంద్

మియాపూర్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు గజ్జెల యోగానంద్ పేర్కొన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సామాజిక న్యాయ వారోత్సవాలను పురస్కరించుకొని శేరిలింగంపల్లిలోని పాపిరెడ్డి కాలనీలో కేర్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు స్థానికులకు బీపీ,షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందజేశారు. ప్రతిరోజు వ్యాయామం, నడక, యోగాను అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేర్ ఆస్పత్రి డాక్టర్లు బీజేపీ నాయకులు రాజుశెట్టి, కాంచన కృష్ణ, వెంకట్,శాంతి భూషణ్ రెడ్డి, రాధామూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన సూర్యచంద్రుల హద్దురాయి

తొలగించినా పట్టించుకోని అధికారులు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ సరిహద్దుతో పాటు రెండు జిల్లాలైన సంగారెడ్డి, రంగారెడ్డి పరిధిని సూచించే సూర్యచంద్రుల హద్దు రాయిని తొలగించి రోడ్డు పక్కన పడేశారు. గోపన్‌పల్లి నుంచి తెల్లాపూర్‌కి వెళ్లే రేడియల్ రోడ్డును ఆనుకొని హద్దురాయి ఉండేది. నిర్మాణ సమయంలో దీన్ని తొలగించారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై అటు మున్సిపల్ అధికారులు, ఇటు రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. మరో పక్క మున్సిపల్ అధికారులు తెల్లాపూర్ మున్సిపాలిటీ అంటూ స్వాగత బోర్డును ఏర్పాటు చేశారు. కాగా మున్సిపల్ హద్దు ఒక చోట ఉంటే బోర్డును మరోచోట ఏర్పాటు చేశారు. దీంతో ఈ బోర్డు ఏర్పాటు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అసలు హద్దులు ఎక్కడ ఉన్నాయో అధికారులకు తెలుసా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

20 మంది మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి కథనం ప్రకారం..మంగళవారం, బుధవారం నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 20 మంది పట్టుబడినట్లు తెలిపారు. వీరిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 17 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు, ముగ్గురికి రూ. 3 వేలు చొప్పున జరిమానా విధించారని సీఐ వివరించారు.

వాహనం ఢీకొన్న ఘటనలో వృద్ధురాలు..



మియాపూర్: వాహనం ఢీకొన్న ఘటనలో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మియాపూర్‌లోని ఆల్విన్ ఎక్స్ రోడ్డు నుండి హాఫీజ్‌పేట్ వెళ్లే రోడ్డులో ఉడిపి హోటల్ ముందు బుధవారం రాత్రి 9 గంటల సమయంలో ఓ వృద్ధురాలు (60-65)ను వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆమె కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడి స్థానికులు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 11.30 గంటలకు మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఆ వృద్ధురాలి గురించి ఆరా తీయగా వివరాలు తెలియలేదు.

క్రైం కార్నర్

ఆర్థిక సమస్యలు తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య



రాజు

మియాపూర్: ఆర్థిక సమస్యలు తాళలేక మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మియాపూర్ హాఫీజ్‌పేట్‌లోని సాయినగర్ కాలనీలో బైదొడ్డి రాజు(31) భార్య దివ్య ఇద్దరు కుమారులు, కూతురుతో నివాసముంటున్నారు. రాజు స్థానికంగా మేస్త్రీ. ఆర్థిక సమస్యలు తలెత్తడంతో తెలిసిన వారి వద్ద రాజు అప్పులు చేశాడు. కొన్ని రోజుల నుండి అప్పులు తీర్చాలని అడుగుతుండడంతో తెలిసిన వారి వద్ద మళ్లీ అప్పు తెమ్మని భార్య దివ్యను తరచు వేధిస్తుండేవాడు. దీంతో భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. కాగా గత కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 8 గంటల సమయంలో రాజు మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవకు దిగాడు. దివ్య డబ్బులు తీసుకువచ్చేందుకు బయటకు వెళ్లింది. తిరిగి రాత్రి 8.30 గంటలకు వచ్చి చూసే సరికి తలుపులు మూసి లోపలి నుండి గడియపెట్టి ఉంది. ఎంత పిలిచిన పలకకపోవడంతో తలుపు మధ్యలో నుండి చూడగా ఇంటి పై కప్పు రాడుకు చున్నీతో ఉరి వేసుకొన్నాడు. స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి కిందికి దించి కొండాపూర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజు మృతి చెందాడు. మృతుని భార్య దివ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పటాన్‌చెరు టౌన్: టాటాఏస్‌ను కంటైనర్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం..గురువారం మండలంలోని ముత్తంగి రింగ్ రోడ్డుపై ఆగి ఉన్న టాటాఏస్‌ను వెనుక నుంచి వచ్చిన కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో టాటాఏస్ డ్రైవర్ శ్రీకాంత్(28)కు తీవ్రగాయాలుకాగా, మరో వర్కర్ రవికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ శ్రీకాంత్‌ను చికిత్స కోసం కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గాయపడ్డ యువకుడు మృతి

పటాన్‌చెరు టౌన్: కారుప్రమాదంలో గాయపడ్డ ఓ యువకుడు చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం బచ్చుగూడెంకు చెందిన సాయిరాంరెడ్డి (18) ఈనెల 5న స్నేహితుడు సాయిమోహన్‌తో కలిసి టీ తాగేందుకు కారులో బచ్చుగూడెం నుంచి సర్వీస్ రోడ్డు మీదగా ముత్తంగికి బయలుదేరారు. నక్కవాగు సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయిరాంరెడ్డికి తీవ్ర గాయాలు కాగా.. మోహన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం సాయిరాంరెడ్డి మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి ...



మియాపూర్: అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీధర్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చందానగర్‌లోని హుడా కాలనీ చెత్త డంపింగ్ యార్డు సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి (520 స్పృహ కోల్పోయి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆ వ్యక్తి చుట్టు ప్రక్కల ఆరా తీయగా ఎలాంటి సమాచారం అందలేదు. దీంతో పోలీసులు ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు.